

పొగమంచుతో జర భద్రం..!

ప్రజాశక్తి - ఏలూరు

పొగమంచులో ప్రయాణించేటప్పుడు వాహనాన్ని వేగం తగ్గించి, హెడ్ లైట్లను తక్కువ కాంతి వచ్చే మోడ్‌లో ఉంచడం, వాహనాల మధ్య సురక్షిత దూరం ఉండే విధంగా చూసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్ వై.సురేష్ బాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి ఆధ్వర్యంలో శనివారం ఏలూరు పాతబస్టాండ్ వద్ద మ్యాక్సీ క్యాబ్ యూనియన్ డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ రాత్రి, వర్షం కురిసే సమయాల్లో, వాహనాలు నడిపేటప్పుడు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించిన నాడే ప్రమాదాలను అరికట్టగలమన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సిద్ధం సభలో మాట్లాడుతున్న జగన్, పక్కనే సభకు హాజరైన జనం

నేను సిద్ధం.. మీరూ సిద్ధంకండి..!



ఎన్నికల సన్నాహాక సభలో కార్యకర్తలకు సిఎం జగన్ పిలుపు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా

ప్రతిఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై మాట్లాడాలి

ఏఒక్క సీటూ కోల్పోకూడదని సూచన

జనం రాకపోవడంతో సగం గ్యాలరీలు ఖాళీ

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

సిపిఎం, ప్రజాసంఘాల నేతలపై నిర్బంధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో మరో చారిత్రాత్మక విజయాన్ని అందుకునేందుకు 'నేను సిద్ధం.. మీరూ సిద్ధంకండి' అంటూ వైసిపి నాయకులు, కార్యకర్తలకు సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహాకాల్లో భాగంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల స్థాయి వైసిపి 'సిద్ధం' సభ ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సిఎం జగన్ హెలీకాప్టర్‌లో సభా ప్రాంగణ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి కాన్వాయ్‌లో సభా వేదికకు చేరుకున్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్యాలరీల మధ్యలో ఏర్పాటు చేసిన దారిగుండా కార్యకర్తలకు, నాయకులకు అభివాదం చేస్తూ కలియతిరిగారు. అనంతరం దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బాయిచౌదరి స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం వైసిపి అధ్యక్షుడు, సిఎం జగన్ మాట్లాడుతూ మరో చారిత్రాత్మక విజయాన్ని అందుకునేందుకు మీరంతా సిద్ధమేనా అంటూ కార్యకర్తలతో నినాదాలు చేయించారు. పేదల భవిష్యత్తును కాటేసే కరోనా వంటి దుష్టచతుష్టయంపై సంగ్రామానికి అక్కచెల్లెమ్మలు, అవ్వ, తాతలు, సోదరులు, స్నేహితులు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. మనం చేసిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి పంచుకోవాలన్నారు. లంచాలు, వివక్షకు తావులేకుండా డిబిటి ద్వారా నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ చేశామన్నారు. పథకాలతో లబ్ధి పొందిన వారంతా స్టార్ క్యాంపెయినర్లుగా మారాలన్నారు. జగన్‌కు ఓటేయకుండా, ప్రతిపక్షాలకు ఓటువేస్తే పథకాల రద్దుకు ఆమోదం తెలిపినట్లే అన్నారు. ఏ ఒక్క సీటూ కోల్పోకూడదని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగినది ఏమిటో.. మన ప్రభుత్వంలో జరిగిన మంచి ఏమిటో జనాలకు తెలియపరిచే బాధ్యత కార్యకర్తలేదనన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలకు అనేక పదవులు కేటాయించామన్నారు. భవిష్యత్తులో ఇంతకంటే ఎక్కువ పదవులిస్తామన్నారు. పార్టీలో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు. బాబు కుట్రలు, కుతంత్రాలు చిత్తు చేసేందుకు సోషల్ మీడియా పరంగా అంతా సిద్ధంగా ఉండాలని తెలిపారు. 60 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయని, మూడు నెలల్లో మన ప్రభుత్వం కొలువుదీరనుందంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు.

అనుకున్న స్థాయిలో రాని జనం

మూడు జిల్లాలో పరిధిలో నిర్వహిస్తున్న ఎన్నికల సభను భారీగా జరపాలని వైసిపి అధిష్టానం భావించింది. 150 ఎకరాల స్థలంలో సభ ఏర్పాటు జరుగుతుందని, లక్షల సంఖ్యలో జనం రానున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. స్కూల్, ఆర్‌టిసి బస్సుల్లో జనాన్ని తరలించేందుకు ప్రయివేటు స్కూళ్లకు సైతం సెలవులు ప్రకటించారు. దాదాపు 50 గ్యాలరీలు వరకూ ఏర్పాటు చేశారు. మూడు వేల మందికిపైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. అయితే అనుకున్న స్థాయిలో జనం రాకపోవడంతో చాలా గ్యాలరీలు ఖాళీగానే ఉండిపోయాయి. జనంలో అభివాదం చేస్తూ నడిచిన జగన్ సైతం గ్యాలరీల్లో జనం లేకపోవడంతో చివరి వరకూ వెళ్లకుండా మధ్యలోంచే తిరిగి వెనక్కి నడిచారు. బస్సులను రోడ్డుపైనే ఆపేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయి సభ అయినపోయిన తర్వాత తిరిగి వెళ్లేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సభకు వచ్చిన జనం ఇబ్బందులు పడ్డారు.

సిపిఎం, ప్రజాసంఘాల నాయకులపై నిర్బంధం

సిఎం ఎన్నికల సన్నాహక సభ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్‌ను పోలీసులు సిపిఎం, సిఐటియు కార్యాలయాల వద్ద నిర్బంధించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజుకు నోటీసులివ్వగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎన్.నర్సింహను గృహనిర్బంధం చేశారు. పోలీసుల తీరుపై ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



సిఐటియు నాయకుల నిర్బంధం



రైతు సంఘం నాయకులు



టిఎన్ఎస్ఎఫ్..

సిపిఎం పర్యటన పేరుతో నేతలపై నిర్బంధం

వైసిపి తలపెట్టిన 'సిద్ధం' సభను అడ్డుకుంటారనే పేరుతో పోలీసులు సిపిఎం, సిఐటియు, ప్రజాసంఘాల నేతలను ముందస్తుగా నిర్బంధించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్‌లను ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్‌ను ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.నరసింహను నూజివీడు మండలం గొల్లపల్లిలో గృహనిర్బంధం చేశారు.

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైసిపి ప్రభుత్వం రానున్న ఎన్నికల కోసం 'సిద్ధం' పేరుతో జిల్లాలోని దెందులూరులో జరిగే సభ కోసం పతాక స్థాయిలో అధికార దుర్వినియోగం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తీవ్రంగా విమర్శించారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దెందులూరులో సిద్ధం పేరుతో ఎన్నికల సభ కోసం తమకున్న అధికారాన్ని తీవ్రస్థాయిలో దుర్వినియోగం చేసిందని, ఇంటర్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేలా పరీక్షలను సైతం వాయిదా వేసి, తమ సభకు జనాన్ని తరలించేందుకు వాహనాల కోసం ప్రయివేటు స్కూళ్లకు సైతం సెలవులు ప్రకటించారని విమర్శించారు. ఆర్‌టిసి బస్సులు 37 డిపోల నుంచి 1300, మరో 700 ప్రయివేటు బస్సులు వినియోగించారని ఫలితంగా జిల్లావ్యాప్తంగా, ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల ప్రజానీకం ప్రయాణానికి తీవ్ర ఇక్కట్లకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 3,298 మంది పోలీసులతో బందోబస్తు పెట్టి వైసిపి తప్ప మిగిలిన ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లనివ్వకుండా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తున్నారన్నారు. భారీస్థాయిలో ట్రాఫిక్‌ని మళ్లించారని, సభా ప్రదేశం కోసం జాతీయ రహదారిని సైతం ధ్వంసం చేసి, డివైడర్‌లను కూడా తొలగించినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఎవరి పార్టీ మీటింగ్ వారు పెట్టుకోవచ్చని, ప్రజలను సమీకరించుకోవచ్చని కాని ఈరకంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ చివరికి పరీక్షలు సైతం నిలిపివేయడం వాళ్ల అధికార దురహంకారానికి నిదర్శనమని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ తప్పుడు పద్ధతులు సరికాదని, అధికార పార్టీ ఎన్నికల సభలకు పోలీసు, రెవెన్యూ, అన్ని శాఖల యంత్రాంగం భాగస్వామ్యం కావడం శోచనీయమని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. తక్షణం జగన్మోహన్ రెడ్డి ఈ తప్పుడు చర్యలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులను నిర్బంధించటం అన్యాయమని పేర్కొన్నారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.నరసింహ, తదితరులను గృహ, కార్యాలయ నిర్బంధం చేయడమే కాకుండా పలువురు నాయకులకు నోటీసులు ఇవ్వడం, ఫోన్లు చేసి బెదిరించడం వంటి దుశ్చర్యలకు పాల్పడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిఐటియు కార్యాలయం వద్ద పోలీసుల పహారా పెట్టి నిర్బంధ చర్యలకు పాల్పడడాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో ప్రభుత్వం, పోలీసులు నియంతృత్వంగా వ్యవహరించడం అప్రజాస్వామికమన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలు ఎప్పుడు జరిగినా ప్రభుత్వం ఈ రకంగా వ్యవహరించడం వారి పిరికితనానికి నిదర్శనమన్నారు. ప్రశ్నించే కార్మిక సంఘాల నాయకులను నిర్బంధించడం మాని, ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కార్మిక సమస్యలు పేరుకుపోయాయని వాటిని కనీసం పరిష్కరించే ఆలోచన కూడా జగన్ ప్రభుత్వం చేయడం లేదని విమర్శించారు. డిఎస్‌సి పేరుతో జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. డిఎస్‌సి పేరుతో మరలా అప్రెంటిస్ విధానాన్ని తీసుకురావడం అత్యంత దుర్మార్గమన్నారు. తక్షణమే రాష్ట్రంలో నిరుద్యోగుల, చిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నూజివీడు : సిద్ధం సభకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దెందులూరు వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహాను నూజివీడు పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

ఏలూరు : దెందులూరులో సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభ జరుగుతున్న సందర్భంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్‌ని ముందస్తుగా దెందులూరు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేకగా బడ్జెట్‌గా నేతల విమర్శ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఏలూరులో నిరసన చేపట్టారు. స్థానిక జ్యూట్‌మిల్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్పొరేట్లకు రాయితీలు-ప్రజలపై భారాలు అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులను, ప్రజలను తీవ్ర నిరాశపర్చిందన్నారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కోత పెట్టడం అన్యాయమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రైతు రుణమాఫీ వంటి ప్రతిపాదనలు లేకపోవడం దారుణమన్నారు. ఎరువుల సబ్సిడీ కుదింపు వల్ల ఎరువుల ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీకి నిధుల కేటాయింపు తగ్గించి వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేశారన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు ప్రతిపాదనలు లేవన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు, విభజన చట్టంలోని హామీల అమలకు ప్రతిపాదనలు లేవన్నారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను అందరూ నిరసించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎం.కృష్ణచైతన్య, కుంచె వసంతరావు, యర్రా శ్రీనివాసరావు, వి.సాయిబాబా, కాకి నాని, బి.జగన్నాథం, ముంగం అప్పారావు, గడసాల రమణ, బుగ్గల ప్రభాకరరావు, అరిగెల యోహాను, గేదెల నాగేశ్వరరావు, వీరభద్రం, నెహ్రూబాబు, బి.సత్తిరాజు సింహాచలం, విజయ్, కోరాడ అప్పారావు, మీసాల వెంకటరమణ, గుడిపూడి జనార్ధన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలుంటే చర్యలు

డ్వామా పీడీ రాము

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



బహిరంగ ప్రజావేదికలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా ప్రాజెక్ట్ అధికారి ఎ.రాము హెచ్చరించారు. మండలంలో 2022-23 సంవత్సరానికి సంబంధించి 12 పంచాయతీల్లో జరిగిన పనులపై మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన బహిరంగ ప్రజా వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం సేకరించిన వివరాలను తనిఖీ చేశారు. మండలంలో ఉపాధి హామీ పనులు జరిగిన పలుచోట్ల నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయలేదని గుర్తించారు. పలుచోట్ల రికార్డుల్లో ఎక్కువ మొక్కలు నాటినట్లు చూపగా క్షేత్రస్థాయిలో తక్కువ మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని ప్రదేశాల్లో మస్తర్లలో అవకతవకలు జరిగినట్లు డిఆర్‌పిలు ప్రజావేదికలో వెల్లడించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా చేసిన పనులకుగాను మూడు లక్షల 8,398 రూపాయల నగదును రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని ఆదేశించారు. మొక్కలు లేని చోట వెంటనే మొక్కలు నాటాలని తెలిపారు. గ్రామాల్లో ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా పనులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఎవి.విజయలక్ష్మి, ఎపీడీ దామోదర్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెఎం. మంగతాయారు, ఎపిఒ జాన్ వెస్లీ, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్లకు ఓరియంటేషన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఈనెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో జిల్లాలోని సైన్స్, ఒకేషనల్ జూనియర్ లెక్చరర్‌లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి బి.ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఉపయోగపరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 29 సెంటర్లలో జరగనున్నాయని, 3,919 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. అలాగే జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 69 సెంటర్లలో జరగనున్నాయని, ఈ పరీక్షలకు 9,898 మంది హాజరవుతారన్నారు. ఈ పరీక్షలు అన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాలు లైవ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, ఈ సంవత్సరం నుంచి ప్రయోగ పరీక్షలు అయిన వెంటనే విద్యార్థి మార్కులు అదేరోజు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయడం జరుగుతుందన్నారు. సైన్స్, ఒకేషనల్ లెక్చరర్‌లకు శిక్షణ ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.యోహాను, ఎ.నాగేశ్వరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



నిరసన తెలుపుతున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యాన మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒ శ్రీనివాస్‌కు వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, రూ.10 వేల వేతనం ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీలోపు బిల్లులు ఇవ్వాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగులో ఉన్న బిల్లులు తక్షణమే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి సిహెచ్.కొండలరావు, మధ్యాహ్న కార్మికులు రాయిని అనసూయ, మురళీ, మంగ, సునీత పాల్గొన్నారు.

టి.నరసాపురం ఎంపిడిఒగా జోగేశ్వరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం



టి.నరసాపురం నూతన ఎంపిడిఒగా కె.జోగేశ్వరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌టిఆర్ జిల్లా బాపులపాడులో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపిడిఒగా పని చేసిన మంగాకుమారి బదిలీపై చాట్రాయి వెళ్లారు. ఈ సందర్భంగా జోగేశ్వరావు మాట్లాడుతూ మండలంలోని సమస్యలు గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

చింతలపూడి ఎంపిడిఒగా చిన్న రాట్నాలు



చింతలపూడి: చింతలపూడి నూతన ఎంపిడిఒగా సిహెచ్.చిన్న రాట్నాలు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో కృష్ణా జిల్లా నుంచి చల్లపల్లికి వచ్చి సాధారణ బదిలీల్లో భాగంగా చింతలపూడికి వచ్చినట్లు తెలిపారు.

బుట్టాయగూడెం ఎంపిడిఒగా జి.ప్రవీణ్



బుట్టాయగూడెం: బుట్టాయగూడెం నూతన ఎంపిడిఒగా జి.ప్రవీణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా ముదినేపల్లిలో పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన వేణు గోపాల్‌రెడ్డి బదిలీపై తూర్పుగోదావరి జిల్లా మామిడి కుదురు మండలం వెళ్లారు. మండలంలో అభివృద్ధికి కృషి చేసి, సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

రేపు ముదినేపల్లి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 5వ తేదీ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ గంగాధర్ రావు శనివారం తెలిపారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

ఎన్ని 'కలలో'..!

ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమ ఆకాంక్షలు నెరవేరేనా అనే ఆతృత, ఉత్కంఠ రాజకీయ పార్టీల నేతలతోపాటు వివిధ తరగతుల ప్రజల్లో నెలకొంది. తమకు టిక్కెట్ దక్కుతుందో, లేదోనని ఆయా పార్టీల్లో ఆశావహులు తర్జనభర్జనలు పడుతుండగా, అభ్యర్థిత్వాలు ఖరారైన వారు తమ గెలుపుబాట ఎలా వేసుకోవాలనే దానిపై వ్యూహాలు రచిస్తూ ముందుకు సాగుతున్నారు. టిక్కెట్ దక్కదు అని స్పష్టమైన వారు తమ భవితవ్యంపై ఆలోచనలు చేస్తూ పక్క పార్టీల వైపు చూస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల ముందైనా తమ సమస్యల పరిష్కారంపై పాలకులు ప్రకటనలైనా చేస్తారా.. కార్యాచరణ చేపడతారా అని వివిధ తరగతుల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల ఒకటో తేదీన బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను నిరాశ పర్చింది. ప్రధానంగా జిల్లాలో కొల్లేరు, పోలవరం నిర్వాసితుల సమస్యలు చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నరసాపురం వద్ద వశిష్ట వారధిపై వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు వచ్చినా ఇప్పుడా ప్రస్తావనే లేదు. బడ్జెట్ ప్రవేశపెట్టిన జిల్లా కోడలు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో ఇక్కడ నుంచి రాజ్యసభకు నామినేట్ అయినప్పుడు నరసాపురం మండలంలో తీర ప్రాంత గ్రామాలు సముద్రపు కోతకు గురికాకుండా రక్షణ గోడ నిర్మించడానికి సర్వేలు, ప్రతిపాదనలు రూపొందించారు. ఈలోపు ఆమె రాజ్యసభ సభ్యత్వం ఇక్కడ పూర్తికావడం, మళ్లీ వేరే రాష్ట్రం నుంచి ఎన్నిక కావడంతో ఆ హామీలన్నీ బుట్టదాఖలయ్యాయి. నిట్‌కు నిధులు, నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్ పనులకు నిధులు, కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్ వంటి అంశాల ప్రస్తావనే లేదు. వేతన జీవులకు ఎప్పటిలానే నిరాశ మిగిలింది. వందేభారత్, బుల్లెట్ ట్రైన్ అంటూ హడావిడి చేస్తున్న కేంద్ర పెద్దలకు జిల్లా మీదుగా ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ అంశం కానరాకపోవడం గమనార్హం. మొత్తంగా కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేసిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇక రాష్ట్ర బడ్జెట్‌లో వైసిపి పెద్దలు జిల్లాలోని సమస్యలను ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటారో వేచిచూడాలి.



ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి కొన్ని బకాయిలను విడుదల చేస్తోంది. దీంతోపాటు ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో యుటిఎఫ్ ముందుకెళ్లడం వైసిపి పెద్దలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పటికే వైసిపి ప్రభుత్వ తీరుతో విసిగిపోయారు. ఈ నేపథ్యంలో మధ్యంతరభృతి, ఒపిఎస్ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏమైనా స్పందిస్తుందా అనే ఆశతో ఉద్యోగులు నిరీక్షిస్తున్నారు.

ఇక డిఎస్‌సి ప్రకటన ఉద్యోగ అభ్యర్థుల్లో ఆశలకన్నా నిరాశనే ఎక్కువ నింపిందని చెప్పొచ్చు. మెగా డిఎస్‌సి వస్తుందనుకుంటే కేవలం 6,100 పోస్టులకే డిఎస్‌సి పరిమితం కావడం, ఉమ్మడి జిల్లాలో కేవలం 150 లోపు పోస్టులే భర్తీ చేయనుండటం వారిని కలవరపాటుకు గురిచేసింది. దీనికితోడు ఆ పోస్టుల కోసమే పోటీ పడదామా అనుకుంటే మళ్లీ అప్రంటీస్ విధానాన్ని తెరపైకి తీసుకురావడం ప్రభుత్వానికి ఇష్టం లేకుండానే డిఎస్‌సి ప్రకటన చేసిందని ఉపాధ్యాయ అభ్యర్థులు వాపోతున్నారు. మరి ఎన్నికల ముందు ప్రభుత్వ విధానం మారుతుందో, లేదో వేచిచూడాలి.

బిఎల్‌ఒలే బలి పశువులా..!

రెండు జిల్లాల్లోనూ ఓటర్ల జాబితాలో తప్పులపై వస్తున్న ఫిర్యాదులకు బిఎల్‌ఒలను బాధ్యులను చేస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు చేపట్టడం చిరుద్యోగులను కలవరపాటుకు గురిచేస్తోంది. డబుల్ ఎంట్రీలు వంటి వాటిని ఆన్‌లైన్ చేసినా మళ్లీ అదే తప్పు పునరావృతం కావడం, ఉన్నతాధికారులు చర్యలు చేపడుతుండటంతో బిఎల్‌ఒ విధుల్లో ఉన్న వారు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల్లో పది మందికిపై బిఎల్‌ఒలపై ఆయా కలెక్టర్లు సస్పెన్షన్ వేటు విధించారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో వాస్తవిక ప్రాతిపదికన పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటే ఎవరూ అభ్యంతరం చెప్పరని, దానికి భిన్నంగా ఆన్‌లైన్, ఇతరత్రా సమస్యల వల్ల చోటుచేసుకుంటున్న తప్పిదాలకు బిఎల్‌ఒలను బలి పశువులను చేయొద్దని పలువురు కోరుతున్నారు.

- విఎస్‌ఎస్‌వి.ప్రసాద్


వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పోలవరం గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం రాత్రి భోజనాలు ఏర్పాట్లు చేసి వడ్డించారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని దూర ప్రాంతాల్లో, వివిధ రంగాలలో స్థిరపడి ఉన్న పదో తరగతి విద్యార్థులు 34 సంవత్సరాల అనంతరం ఆత్మీయ కలయికలో భాగంగా వృద్ధులకు అన్నదానం, అవ్వ, తాతలకు వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. ఆదివారం గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకుని పూర్వ విద్యార్థులందరూ వారి అలనాటి తీపి స్మృతులను గుర్తు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు.


సర్దుబాటు చేస్తున్న పోలీసులు

కాట్రేనిపాడులో ఫ్లెక్సీ వివాదం

ప్రజాశక్తి - ముసునూరు

ఫ్లెక్సీ బ్యానర్ల వివాదంలో టిడిపి, వైసిపి వర్గీయుల మధ్య వివాదం నెలకొనడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గీయులను అదుపులోకి తీసుకున్న సంఘటన ముసునూరు మండలంలో చోటుచేసుకుంది. శనివారం మండల కేంద్రమైన కాట్రేనిపాడు గ్రామంలో టిడిపి నాయకులు వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిపై రాజధాని నిర్మించలేకపోయాడు, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయాడు అంటూ ఫ్లెక్సీ బ్యానర్ పెట్టడంతో.. అదే బ్యానర్‌కు ఎదురుగా వైసిపి వర్గీయులు రాష్ట్రంలో నివాసం లేకుండా తెలంగాణ రాష్ట్రమైన పక్క రాష్ట్రంలో ఉంటూ రాష్ట్రాన్ని పరిపాలించడానికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధమయ్యారంటూ మరో ఫ్లెక్సీ బ్యానర్‌ను పెట్టారు. దీంతో నాయకులు, కార్యకర్తల మధ్య కొంతమేర వివాదం నెలకొనటంతో గొడవలు వచ్చే పరిస్థితుల్లో ముసునూరు ఎస్ఐ పి.వాసు తమ సిబ్బందితో కలిసి రంగ ప్రవేశం చేసి, ఇరు వర్గీయులకు సర్దుబాటు చేసి రెండు ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ కార్యక్రమం పెయ్యేరు కాలనీలో శనివారం చేపట్టారు. ఏలూరు పార్లమెంట్ కో కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఎవిఆర్ నాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో ఎవ్వరూ కూడా కట్టెల పొయ్యిపై వంట చేసుకుని అనారోగ్యం గురి కాకూడదు అనే సదుద్దేశంతో అర్హులైన అందరికీ ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేయాని ఉజ్యాలా యోజన పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం అర్హులైన పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి, కొల్లిపర నాగరాజు, మొవ్వ ఫణి, రెడ్డి నాగలక్ష్మి, రవికుమార్, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రాలుతున్న మామిడి పూత.. కాయ కాసేనా..!

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - చింతలపూడి

పండ్లలో మామిడి రారాజు.. అందరూ అమితంగా ఇష్టపడే ఫలం మామిడి. మామిడికి ఈసారి ప్రతికూల వాతావరణ నేపథ్యంలో పూత ఇంకా కనిపించలేదు. ఇప్పటికే పిందెలు రావాలి.. అయితే చాలా చోట్ల కనీసం పూత కూడా కనిపించడం లేదు. ఈఏడాది దిగుబడే ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. దీనికి తోడు మంచు కూడా విపరీతంగా పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాసిన కాస్త పూత కూడా ఎక్కడ రాలిపోతుందో అని భయపడుతున్నారు.


పూత వచ్చి రాలిపోతున్న మామిడి చెట్టు

చింతలపూడి మండలంలో 1,700 ఎకరాల్లో మామిడి విస్తీర్ణం ఉంది. మామిడి తోటలో పూతతో కలకలలాడాల్సిన తరుణమిది. ఇప్పుడిప్పుడే పిందెలతో పచ్చగా మెరవాల్సిన తోటల్లో ఎక్కడా పూత జాడ కనిపించడం లేదు. పూత, పిందెలు కనిపించక మామిడి తోటలు బోసిపోతున్నాయి. వాతావరణ మార్పులు రైతులకు శాపంగా మారాయి. మామూలుగా అయితే నవంబర్ చివరి నుంచే పూత రావడం మొదలు పెడుతుంది. ఈసారి ఫిబ్రవరి ముగుస్తున్నా ఇంకా అధికశాతం పూత రాని పరిస్థితి. కొన్ని చెట్లకు తక్కువ పూత వచ్చింది. పొగ మంచు, చలి ఉష్ణోగ్రతలో వ్యత్యాసం కారణంగా పూత రాలేదని రైతులంటున్నారు. తేనె మంచు పురుగు, పచ్చపురుగు, నల్లపేను, తెల్లపేను రావటం, అక్కడక్కడా వచ్చినా మంచు కారణంగా మాడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి పరిధిలో బంగినపల్లి, చిన్న రసం, పెద్ద రసం, కొత్తపల్లి, కొబ్బరికాయ నాట్లు, నీలం, హిమాపసంద్ తదితర రకాలు లభిస్తాయి. మంచు కారణంగా తేడా కనిపిస్తుందని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి పెట్టినా లాభం లేదు

తేనె మంచు, పచ్చ మంచు, నల్లపేను, తెల్లపేను వల్ల మామిడిపండు పూత రాలిపోతుంది. దీంతో ఎంతో కష్టపడి పెట్టుబడులు పెట్టినా తెగులు కారణంగా పిందెలు రాలిపోతున్నాయి. ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

నరపం మల్లేష్, బాలవారిగూడెం, 10 ఎకరాల రైతు

మంచు వల్ల పూతలు రాలిపోతున్నాయి

మంచు వల్ల పూతలు రాలిపోతున్నాయి. మంచు కారణంగా పూత రాలిపోవడంతో పిందెలు కూడా రాని పరిస్థితి. వాతావరణం ఇలాగే కొనసాగితే ఈ ఏడాది నష్టపోవడం తప్పదు.

తాడిగడప నాగరాజు, బాలవారిగూడెం, మూడు ఎకరాల రైతు


తరలిస్తున్న సిమెంట్ బస్తాలు

'నాడు-నేడు' సిమెంట్ బస్తాలు పక్కదారి

ప్రజాశక్తి - చింతలపూడి

నాడు-నేడుకు సంబంధించి సిమెంట్ బస్తాలు పక్కదోవ పట్టిస్తున్న సంఘటన చింతలపూడి మండలంలో చోటుచేసుకుంది. చింతలపూడి మండలం రాఘవపురంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు-నేడుకి సంబంధించిన సిమెంట్ బస్తాలు ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ తాపీ మేస్త్రికు సిమెంటు బస్తా రూ.120 చొప్పున 35 సిమెంట్ బస్తాలు అమ్ముకున్నారని వైసిపి నాయకులు గిరిభోగరావు ఆరోపించారు. తాపీ మేస్త్రి రామకృష్ణ ఇంటి వద్దకు వెళ్లగా ఆటోని పట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణకు ఫోన్‌పే ద్వారా అమౌంట్ చెల్లించినట్లుగా తెలిపారు. దీనిపై తాపీ మేస్త్రిని వివరణ అడగక ప్రధానోపాధ్యాయుల ఇంటి వద్ద తాపీ పనులు చేసే వాడిని ఆ పరిచయంతో ప్రధానోపాధ్యాయులు సిమెంట్ బస్తాలు బస్తా రూ.120 చొప్పున తమకు అమ్మినట్లుగా ఆయన అన్నారు. దీనిపై ఎంఇఒ కిరణ్ బాబు విచారించగా ఆయన వద్ద హెచ్‌ఎం సిమెంట్ బస్తాలు అమ్మినట్లుగా ఒప్పుకున్నారు. దీనిపై ఎంఇఒ కిరణ్ బాబుని వివరణ అడుగగా తాపీ మేస్త్రి వద్ద వివరణ తీసుకున్నామని, సాక్షులు వద్ద కూడా వివరణ తీసుకున్నామని, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

పరీక్ష వాయిదా సిగ్గుచేటు

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు

సిఎం సభ కోసం పరీక్షను వాయిదా వేయడం సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. సిఎం సభకోసమే పరీక్షను వాయిదా వేసారని అభిప్రాయపడింది. పరీక్షను కొనసాగించాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎక్కడ సభ జరిగితే ఆ ప్రాంతంలో షాపులు మూయించడం, విద్యా సంస్థలకు శెలవులు ఇవ్వటం ఇదొక ఆనవాయితీ అయిందన్నారు. ఇదేవిధంగా 3వ తేదీ దెందులూరు ఎన్నికల సభ నేపథ్యంలో ప్రజలను తరలించేందుకు బస్సుల వినియోగానికి ఇంటర్ పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేయడం ఏమిటని ప్రశ్నించారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఇంటర్ శాఖను వైసిపి రాజకీయ కేంద్రంగా తయారు చేస్తుందని మండిపడ్డారు. ఇదే పద్ధతి కొనసాగితే కమిషనర్‌ను కూడా అనర్హుడుగా చూడాల్సి వస్తుందన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను అటలాడటం సరికాదన్నారు. వెంటనే పరీక్షను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా కేంద్రం, రాష్ట్ర స్థాయి వరకు ఏ కార్యక్రమాలు జరిగినా విద్యార్థులను తీసుకెళ్లడం అలవాటైపోయిందన్నారు. మొన్న ఎంఎల్ఎ తీసుకురమన్నారని ఏలూరు పట్టణంలో రాజకీయాలకు విద్యార్థులను తీసుకుని వెళ్లారు. తమ హక్కుల కోసం అడిగితే కళాశాల, స్కూల్ యాజమాన్యాన్ని బెదిరిస్తున్న ప్రభుత్వం రాజకీయ ప్రచారానికి ఎందుకు విద్యార్థుల్ని తీసుకు వెళుతుందని ప్రశ్నించారు. ఇక మీదట ఇలాంటివి కొనసాగితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలలో విద్యా, విజ్ఞాన ప్రదర్శన

ప్రజాశక్తి - పోలవరం


విద్యార్థులతో హెచ్‌ఎం రాఘవన్

మండలంలోని గూటాల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 9వ తరగతి విద్యార్థులచే ఇంగ్లీష్ అకాడమిక్ పెర్ఫార్మెన్స్ ప్రదర్శన నిర్వహించారు. పిల్లలు ఇప్పటిదాకా నేర్చుకున్న పాఠ్యపుస్తకాల అంశాలను వివిధ ప్రక్రియలు, సంభాషణలు, ఉపన్యాసాలు, కథలు, రోల్ ప్లేలు ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. పిల్లలు ఏవైనా నేర్చుకున్నారంటే కేవలం పరీక్షలు రాయడం ఒకటే ప్రమాణం కాదు, వాళ్లు నేర్చుకున్న వాటిని ప్రదర్శించాలి అని. దీని ద్వారా పిల్లలకు భయం పోవడమే కాకుండా తాము చెప్పగలం అనే ఆత్మవిశ్వాసం వస్తుంది. ఈరోజుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంత అవసరమో మన అందరికీ తెలుసు. ఆంగ్ల ఉపాధ్యాయిని వంగీపురం స్వర్ణలత మాట్లాడుతూ పాఠశాలల్లో జరిగే ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో ప్రదర్శనా నైపుణ్యాలను పెంచుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెవి.రాఘవన్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు ప్రతి సబ్జెక్ట్‌లోనూ చేయవచ్చుని, అది పిల్లల జ్ఞానాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, పేరెంట్ కమిటీ మెంబర్లు, ఉపాధ్యాయులు పిల్లల్ని అభినందించారు.

టిడిపితోనే బిసిలకు రక్షణ : చింతమనేని

ప్రజాశక్తి - పెదవేగి


నియామక పత్రాలు అందజేస్తున్న చింతమనేని

రాష్ట్రంలో బిసిలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించి, వారికి అన్ని విధాలా అండగా నిలిచిన పార్టీ టిడిపి అని, వైసిపి పాలనలో బిసిలు మోసపోవటమే కాకుండా దాడులకు సైతం గురయ్యారని, మళ్లీ బిసిలకు అభ్యున్నతి, రక్షణ రావాలి అంటే టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు నియోజకవర్గం నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమించబడిన కొప్పాక వెంకటేశ్వరావు, కొక్కిరిపాటి సురేష్ శనివారం ఉదయం దుగ్గిరాలలోని టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ వారికి నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమం కోసం టిడిపి పాలనలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారికి అండగా నిలిచామని, నూతనంగా నియామకం పొందిన నాయకులు నాయీ బ్రాహ్మణ సాధికారత కోసం, నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడం కోసం మరింత కృషి చేయాలని చింతమనేని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ వైద్యం శాంతారామ్, జిల్లా కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు, ఏలూరు పార్లమెంటు సభ్యులు దావీదు, అన్నవరపు రామకృష్ణ, దొండపాటి సునీల్, పలువురు నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ఉంగుటూరు


కండువా కప్పి ఆహ్వానిస్తున్న గన్ని

టిడిపి నారాయణపురం గ్రామ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పలు పార్టీల నుంచి గురువెల్లి రాజారావు, గురువెల్లి ప్రసాద్ టిడిపిలోకి చేరారు. గన్ని వీరాంజనేయులు వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు సప్ప వీరబాబు, సర్పంచి దిడ్ల అలకనంద శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పాతూరి విజయ్ కుమార్, చేబ్రోలు సర్పంచి రాందే లక్ష్మి సునీత, తల్లాపురం సర్పంచి పసుపులేటి నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

'రా కదలిరా' బహిరంగ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి


టి.నరసాపురం : మాట్లాడుతున్న టిడిపి నేతలు

చింతలపూడిలో ఈనెల 5వ తేదీన జరగనున్న రా కదిలి రా కార్యక్రమానికి టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని, సభను జయప్రదం చేయాలని టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాలూరి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈమేరకు ప్రగడవరం పంచాయతీలో ఉన్న కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రా కదిలిరా కార్యక్రమం ఎక్కడ పెట్టినా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తిపోయారని, వైసిపిని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, ప్రజలందరికీ మేలు జరుగుతుందని తెలిపారు. 5న జరిగే బహిరంగ సభకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానేపల్లి రాజారావు, బుద్దాల శీను తిరుపతిరావు, శ్రీనివాస్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు : టిడిపి ఆదేశాల మేరకు ఈనెల 5న చింతలపూడిలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గస్థాయి రా కదలి రా సభను జయప్రదం చేసే నిమిత్తం శనివారం ఉదయం మండల కేంద్రంలో టిడిపి అధ్యక్షులు దేవినేని డీలారామ్ అధ్యక్షతన టిడిపి ముఖ్య కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడవ జోన్‌లోనున్న 2.36 లక్షల ఆయకట్టు సుదీర్ఘకాలంగా తెలంగాణ నుంచి సాగునీరు రాని పరిస్థితిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను అందించడానికి గత టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో దూర దృష్టితో చింతలపూడి ఎత్తిపోతల పథకానికి రూ.4,909 కోట్లు మంజూరు చేయించారన్నారు. అంతే కాకుండా రూ.3450 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పూర్తి చేశారని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని అటకెక్కించటం వల్ల రైతులు వేలకోట్ల రూపాయల మెట్ట పంటలు నష్టపోయారని, ఈ పథకం పూర్తి అయితే నూజివీడు నియోజకవర్గంలో 50 వేల ఎకరాలు, ముసునూరు మండలంలో 19 వేల ఎకరాలకు సమృద్ధిగా గోదావరి జలాలు అందుతాయని తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రాబోయే టిడిపి ప్రభుత్వంలో పూర్తి చేసుకోవడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముసునూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య, మాజీ ఎంపిపి మసిముక్కు సుబ్బారావు, మాజీ జెడ్‌పిటిసి చిలుకూరు వెంకటేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్లు తుమ్మల లక్ష్మణరావు, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం గత టిడిపి ప్రభుత్వంలో రూపొందించిన చింతలపూడి ఎత్తిపోతల పథకం బ్రోచర్‌ను ఆవిష్కరించి ఈ పథకం విశేషాలను కార్యకర్తలకు తెలియజేశారు.

టి.నరసాపురం : చింతలపూడిలో ఈనెల 5న జరగనున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నిర్వహించే 'రా కదలి రా' బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక విజయలక్ష్మీ థియేటర్ వద్ద టిడిపి, జనసేనల ఆధ్వర్యాన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలన్నా, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జనసమీకరణ చెయ్యాలని, చింతలపూడి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, పోలవరం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, నల్లూరి వెంకట చలపతి రావు, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్ రావు, భీమవరపు జగన్మోహన్ రావు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట సూర్యనారాయణ, అడపా నాగరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మద్యం మత్తులో ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని తూర్పు వీధికి చెందిన బూసి దినేష్(18) అల్లరి చిల్లరగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతూ ఉండేవాడు. అతిగా మద్యం తాగిన అతను శుక్రవారం ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారేసరికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

సిద్ధం సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

జిల్లాలోని దెందులూరులో ముఖ్యమంత్రి చేపట్టిన సిద్ధం కార్యక్రమానికి శనివారం మండలం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. 15 గ్రామ పంచాయతీల్లోని మర్రిగూడెం, బండివారిగూడెం, బంధంచర్ల, కేతవరం, టి.నరసాపురం తదితర గ్రామాల నుంచి బస్సులు, కారుల్లో వెళ్లారని నాయకులు తెలిపారు. సిద్ధం కార్యక్రమానికి వెళ్లిన వారిలో వైసిపి నాయకులు ఎస్‌విపికెహెచ్ శ్రీను రాజు, దేవరపల్లి ముత్తయ్య, సీతారాం ప్రసాద్, కురసం నిరీక్షణరావు, కన్నం సర్వేశ్వరరావు పలువురు ఉన్నారు.


జీలుగుమిల్లి..

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల కేంద్రం నుంచి, గ్రామాల నుంచి దెందులూరులో జరిగే సిద్ధం కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఎన్నికల శంఖారావం ఈ సభ నుంచి మొదలు కానుంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. ఈ సభ ద్వారా ఎలాంటి హామీలు ఇస్తారని ప్రజలు, ప్రతిపక్షాలు ఆతృతగా ఎదురుచూస్తున్నాయి. జగన్ ఓన్స్ మోర్ అనే నినాదంతో ఈసారి జగన్ ప్రజల్లోకి వస్తున్నారు. ఈసారి 175 సీట్లకు 175 లక్ష్యం అని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.


కొయ్యలగూడెం..

చింతలపూడి: 2024 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తుందని చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి, వైసిపి విద్యార్థి విభాగం వైస్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి భరత్ రెడ్డి అన్నారు. చింతలపూడి మండలం దెందులూరులో ముఖ్యమంత్రి సిద్ధం కార్యక్రమానికి వైసిపి కార్యకర్తలు, అభిమానులు మండలం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలే వైసిపిని అధికారంలోకి తీసుకొస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గిరిభోగరావు కృష్ణ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : దెందులూరు సహార మైదానంలో శనివారం వైసిపి ఆధ్వర్యాన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తలపెట్టిన సిద్ధం బహిరంగ సభకు మండలంలోని నలుమూలల నుంచి వైసిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. బహిరంగ సభకు ఆయా పంచాయతీలకు 8 ఆర్‌టిసి బస్సులు, 10 కార్లలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సందా ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాస్, సిహెచ్.శ్రీను, కె.రాము, ప్రేమ్ కుమార్, ఎంపిటిసిలు తరలి వెళ్లారు.

ముదినేపల్లి: దెందులూరులో శనివారం జరిగిన సిఎం సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి భారీగా వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సులు, ప్రయివేట్ పాఠశాల బస్సుల్లో సిద్ధం సభకు తరలి వెళ్లారు. ఎంపిపి సత్యనారాయణ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా పార్టీ శ్రేణులు బయలుదేరి వెళ్లారు.

శిశు సంక్షేమ శాఖలో పలు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు

మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యాన పలు పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిపై పని చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ అధికారి కెవివిఎల్.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలు eluru.ap.gov.in వెబ్ సైట్‌లో పొందుపరచడమైందన్నారు. కావున సంబంధిత పోస్టులకు దరఖాస్తులు ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కార్యాలయం పని దినాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 08812 -242621, 08812-249883, 08812- 222621 సంప్రదించాలన్నారు.

జాబ్‌మేళాలో 353 ఎంపిక

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ స్థాయిలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రథమ లక్ష్యమని చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వెంప దుర్గారావు అన్నారు. చింతలపూడి పట్టణంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు నియోజకవర్గం నుంచి 754 మంది నిరుద్యోగ యువతీ యువకులు రాగా 353 మందికి ఉద్యోగావకాశాలు ఇచ్చినట్లుగా ఆయన తెలిపారు. ఇదేవిధంగా లింగపాలెం మండలం కామవరపుకోట, జంగారెడ్డిగూడెంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని, చింతలపూడి నియోజకవర్గ నిరుద్యోగ యవతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లుగా తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామని తెలియజేశారు.

వెండి తాపడం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానానికి శనివారం దాతలు నగదు విరాళంగా అందజేశారు. గుడివాడకు చెందిన వేముల నాగసాయి బాలాజీ, లక్ష్మీ ప్రావణ్య దంపతులు స్వామివారి దేవస్థాన అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం చేయు నిమిత్తం రూ.10,116లు, అలాగే గుడివాడ వాస్తవ్యులు వేముల మణీశ్వర్ రూ.10,116 నగదును ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి నేల సంధ్యకు విరాళంగా అందజేశారు.